09-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ పురుషోత్తమ సంగమయుగములో పురుషోత్తములుగా అయ్యేందుకు పూర్తి-పూర్తి పురుషార్థం చేయండి, ఎంత వీలైతే అంత స్మృతి మరియు చదువు పట్ల అటెన్షన్ పెట్టండి"

ప్రశ్న:- పిల్లలైన మీరు చాలా పెద్ద వ్యాపారస్థులు, మీరు ఎల్లప్పుడూ ఏ విషయము పట్ల అటెన్షన్ పెట్టి ఆలోచించాలి?

జవాబు:- ఎల్లప్పుడూ లాభ-నష్టాల గురించి ఆలోచించండి. ఒకవేళ వీటి గురించి ఆలోచించకపోతే ప్రజలలో దాస-దాసీలుగా అవ్వాల్సి ఉంటుంది. తండ్రి 21 జన్మల రాజ్య వారసత్వాన్ని ఏదైతే ఇస్తారో, దానిని పోగొట్టుకుంటారు, అందుకే తండ్రితో పూర్తి వ్యాపారము చేయాలి. తండ్రి దాత, పిల్లలైన మీరు సుదాముని వలె పిడికెడు బియ్యాన్ని ఇస్తారు మరియు విశ్వ రాజ్యాధికారాన్ని తీసుకుంటారు.

ఓం శాంతి. పిల్లలు ఇక్కడ కూర్చున్నారు. ఇది స్కూలు. ఇది సత్సంగమేమీ కాదు. మహాత్ములో, బ్రాహ్మణులో లేక ఏ సన్యాసులో మీ ఎదురుగా కూర్చోలేదు. స్వామి కోపగించుకుంటారేమోనని భయపడాల్సిన విషయమేమీ లేదు. భక్తి మార్గంలో సాధు-సన్యాసులు ఎవరినైనా ఇంటికి పిలుస్తే వారి చరణాలను కడిగి ఆ నీరు తాగుతారు, కానీ వీరు తండ్రి కదా. ఇంట్లో పిల్లలు ఎప్పుడైనా తండ్రికి భయపడతారా? మీరైతే వారితో కలిసి తింటారు, తాగుతారు, ఆడుకుంటారు కూడా. అదే సన్యాసులు, గురువులు మొదలైనవారితో ఈ విధంగా చేస్తారా? అక్కడైతే రోజంతా గురువు గారు, గురువు గారు అని అంటూ ఉంటారు. ఇక్కడ అలా చేయకూడదు. వీరు తండ్రి. గురువు నుండి గురు యొక్క వారసత్వము, టీచర్ నుండి టీచర్ యొక్క వారసత్వము లభిస్తుంది. తండ్రి నుండైతే ఆస్తి లభిస్తుంది. కొడుకు జన్మించగానే వారసునిగా అవుతాడు. ఇక్కడ కూడా తండ్రికి పిల్లలుగా అయ్యాము, తండ్రిని గుర్తించాము, ఇక అంతే మనం స్వర్గాధిపతులుగా అయినట్లే. తండ్రి స్వర్గ రచయిత. ఈ లక్ష్మీ-నారాయణులు స్వర్గ రాజ్యాన్ని ఏ విధంగా తీసుకున్నారు మరియు ఎక్కడి నుండి తీసుకున్నారు - ఇది ఎవ్వరికీ తెలియదు. మేము ఈ విధముగా ఉండేవారము, మళ్ళీ ఈ విధంగా అవుతున్నాము అని మీరు భావిస్తారు. వీరు ఎవరు, మేము ఎవరిని పూజిస్తున్నాము అని మనుష్యులైతే అసలేమీ ఆలోచించరు. శివుని మందిరాలకు వెళ్ళి కేవలం అభిషేకం చేసి వస్తారు, కానీ అర్థమేమీ తెలియదు. మేము ఈ మృత్యులోకపు శరీరాన్ని వదిలి అమరలోకములోకి వెళ్తాము అని ఇప్పుడు మీకు ఫీలింగ్ కలుగుతుంది. ప్రాప్తి ఎంత గొప్పగా ఉంది. భక్తి మార్గంలో అసలు ఏ ప్రాప్తి లేదు. బాబా స్వయం కూడా చెప్తూ ఉంటారు - నేను 12 మంది గురువులను ఆశ్రయించాను, కానీ ఇదంతా సమయాన్ని వృథా చేసుకోవడమే అయ్యింది, ఇంకా కిందకే దిగజారుతూ వచ్చాను అని ఇప్పుడు అర్థం చేసుకున్నాను. కానీ ఇది కూడా డ్రామాలో నిశ్చయించబడి ఉంది. మనకు ఎవ్వరితోనూ శత్రుత్వము లేదు. మనకు ఒక్క తండ్రితో మాత్రమే ప్రీతి ఉంది. మీరు ఎప్పుడైతే క్లాస్ లోపలికి వస్తారో, అప్పుడు ఈ చిత్రాలను చూసి సంతోషించాలి - మేము చదువుకొని ఈ విధంగా అవుతున్నాము అని. ఈ రాజధాని ఏ విధంగా స్థాపనవుతుంది అనేది మీకు తెలుసు. తండ్రి అంటారు - పిల్లలూ, తికమకపడకండి. తండ్రి ఎంత మంచి రీతిలో అర్థం చేయిస్తారు, అయినా కానీ ఆశ్చర్యం కలిగించేలా వింటారు, వినిపిస్తారు, మళ్ళీ పారిపోతారు. మాయకు చెందినవారిగా అయిపోతారు, అటువంటివారిని ద్రోహులు అని అంటారు, వారు ఒక రాజధానిని వదిలి వెళ్ళి ఇంకొక రాజధానికి చెందినవారిగా అవుతారు. తండ్రి ఎంత మంచి రీతిలో పురుషార్థము చేయిస్తారు. భక్తి మార్గంలో ఎంతగా భ్రమిస్తారు. దాన-పుణ్యాలు, తీర్థాలు, వ్రతాలు-నోములు మొదలైనవెన్నో చేస్తారు. మంచిది, సాక్షాత్కారం కలిగిందే అనుకోండి, ఏమవుతుంది. ఎక్కే కళలోకి అయితే వెళ్ళలేదు, ముందుకన్నా దిగిపోయే కళలోకి వెళ్ళారు. మీదైతే రోజురోజుకూ ఎక్కే కళే. మిగిలినవారందరిదీ దిగే కళ. జ్ఞానము బ్రహ్మ యొక్క పగలు, భక్తి బ్రహ్మ యొక్క రాత్రి అని గురువులు కూడా అంటారు. జ్ఞానము మరియు భక్తికి రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. జ్ఞానం ద్వారా సుఖము లభిస్తుంది. మీరే విశ్వాధిపతులుగా ఉండేవారు, మళ్ళీ మీరే కిందకు దిగుతూ వచ్చారని తండ్రి ఎంత సహజంగా అర్థం చేయిస్తారు. ఇప్పుడు తండ్రి అంటారు - కేవలం స్వయాన్ని ఆత్మగా భావించండి. ఆత్మ అవినాశీ. ఓ అవినాశీ తండ్రి, మీరు వచ్చి మమ్మల్ని పావనంగా చేయండి అని ఆత్మ అంటుంది. ఇందులో ముక్తి-జీవన్ముక్తి అన్నీ వచ్చేస్తాయి. ఇప్పుడు మీకు అర్థమైంది - భక్తిలో మనకు అసలేమీ తెలిసేది కాదు, వెతుకుతూ ఉండేవారము, ఓ భగవంతుడా, దయ చూపించండి అని పాడుతూ ఉండేవారము. భగవంతుడా అని అనడంతో అంత రుచి అనిపించదు, వారసత్వము గుర్తుకురాదు. ఉన్నతోన్నతమైన శివబాబా అని మీరు అంటారు, అప్పుడు వెంటనే వారసత్వం గుర్తుకొస్తుంది. ఇది రావణ రాజ్యము అని ఇప్పుడు మీకు అర్థమవుతుంది. రామరాజ్యం సత్యయుగములో ఉంటుంది. ఇప్పుడిది కలియుగము.

సత్యయుగములో చాలా కొద్దిమంది మనుష్యులు ఉండేవారు. ఒకే ఆది సనాతన ధర్మం ఉండేది. సుఖ-శాంతులు ఉండేవి. ఇక్కడ మనుష్యులు శాంతి కొరకు భ్రమిస్తూ ఉంటారు. కాన్ఫరెన్స్ లు మొదలైనవాటికి ఎంత ఖర్చు చేస్తారు. మీరు వాళ్ళకు ఈ విధంగా వ్రాయవచ్చు - వారే శాంతిసాగరుడు, పవిత్రతా సాగరుడు, సంపదకు కూడా వారే సాగరుడు, అంతా వారి నుండే లభిస్తుంది.

ఇప్పుడు మీకు తెలుసు - సత్యయుగములో మనం చాలా ధనవంతులుగా ఉండేవారము. విశ్వములో శాంతి అక్కడ ఉండేది. ఇకపోతే ఆత్మలందరికీ శాంతి పరంధామమైన ఇంట్లో ఉంటుంది. విశ్వములో మనం ఒక్కరిమే ఉండేవారము, అప్పుడు సుఖ-శాంతులు అన్నీ ఉండేవి. కావున పిల్లలకు చాలా సంతోషముండాలి. ఇటువంటి స్వర్గము గురించి శాస్త్రాలలో ఏమేమి విషయాలను వ్రాసేసారు. ఇప్పుడు తండ్రి అంటారు - నేను మీకు ఎంతగా అర్థం చేయిస్తానంటే ఇక మీరు ప్రశ్నలు మొదలైనవేవి అడగాల్సిన అవసరం లేదు. మొదట అయితే నన్నొక్కరినే స్మృతి చేయండి. మీరు వచ్చి పతితులను పావనంగా చేయండి అనగా పాత ప్రపంచాన్ని వచ్చి కొత్తగా తయారుచేయండి అని మీరు పిలుస్తారు. కానీ దాని అర్థాన్ని ఏమీ అర్థం చేసుకోరు. దారం చిక్కులు పడి ఉంది. ఇప్పుడు దానిని సరి చేయాల్సి ఉంటుంది. భక్తిలో ఎన్ని చిత్రాలను తయారుచేసారు, కృష్ణుడికి చక్రాన్ని చూపించారు, దానితో అకాసురుడు, బకాసురుడిని హతమార్చినట్లు చూపించారు. అరే, అతనేమైనా హింసకుడా? అంతేకాక ఫలానా, ఫలానావారిని ఎత్తుకుపోయారు అని అంటారు. అతడిని డబుల్ హింసకునిగా చేసేసారు. ఇది విచిత్రము కదా, ఎవరైతే శాస్త్రాలను తయారుచేసారో, ఇది వారి బుద్ధి యొక్క చమత్కారము. మళ్ళీ అతడిని వ్యాస భగవానుడు అని అంటారు. ఇప్పుడు తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి మరియు దైవీ గుణాలను ధారణ చేయండి. ఇంకే విషయమూ లేదు. మిమ్మల్ని యోగములో కూర్చోబెట్టడం జరుగుతుంది ఎందుకంటే బాబాను స్మృతి చేయనివారు ఎంతోమంది ఉన్నారు. వారు తమ-తమ వ్యాపారాలలోనే ఉంటారు. వారికి తీరికే ఉండదు. కానీ ఇక్కడైతే పనులు మొదలైనవి చేసుకుంటూ కూడా బుద్ధితో స్మృతి చేయాలి. మీరు ప్రియుడినైన నాకు ప్రేయసులు. ఇప్పుడు నేను మీకు చెప్తున్నాను - ఇతర సాంగత్యాలను తెంచి నా ఒక్కరితోనే సాంగత్యాన్ని జోడించండి. తింటూ-తాగుతూ కేవలం - నేను ఆత్మను అని భావించండి మరియు తండ్రిని స్మృతి చేయండి, ఇది అలవాటు చేసుకోండి. తండ్రి మిమ్మల్ని ఎంత ఉన్నతంగా తయారుచేస్తారు, మీరు ఈ చిన్న విషయాన్ని కూడా పాటించరు, నన్ను స్మృతి చేయరు. మీ పిల్లా-పాపలను గుర్తు చేసుకుంటారు, నన్ను గుర్తు చేయలేకపోతారు. వాస్తవానికి నిష్ఠ అన్న పదాన్ని ఉపయోగించడం రాంగ్. బాబా డైరెక్టుగా వచ్చి - నన్నొక్కరినే స్మృతి చేయండి అని చెప్తారు. కల్పక్రితం కూడా తండ్రి సమ్ముఖముగా అర్థం చేయించారు. ఇప్పుడు వారు అర్థం చేయిస్తున్నారు - మధురాతి-మధురమైన పిల్లలూ, కల్పం తర్వాత కలిసిన ప్రియమైన పిల్లలూ... ఇప్పుడు మీ 84 జన్మలు పూర్తయ్యాయి. ఇప్పుడు తిరిగి వెళ్ళేందుకు మీరు పవిత్రముగా తప్పకుండా అవ్వాల్సి ఉంటుంది. వికారాలలోకి వెళ్ళిన కారణముగానే మీరు చాలా పతితులుగా అయ్యారు. పావనంగా అవ్వకపోతే పదవి కూడా తక్కువగానే లభిస్తుంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి మరియు 84 జన్మల చక్రాన్ని కూడా స్మృతి చేయండి, ఇదే స్వదర్శన చక్రము. దీని అర్థము కూడా ఎవ్వరికీ తెలియదు. నోటితో జ్ఞాన శంఖాన్ని మ్రోగించాలి. ఇవి జ్ఞానపు విషయాలు. వీరు మీ అనంతమైన తండ్రి, స్వర్గ రచయిత, తండ్రిని స్మృతి చేసినట్లయితే మీరు ఎక్కే కళలోకి వెళ్తారు. ఇది ఎంత సహజమైన విషయము.

ఇదంతా తయారై తయారుచేయబడిన డ్రామా అని పిల్లలైన మీకు ఇప్పుడు అర్థమవుతుంది. ప్రతి 5000 సంవత్సరాల తర్వాత తండ్రి వస్తారు. ఇప్పుడు మంచి రీతిలో పురుషార్థం చేయండి. మీరు ధనం వెనుక ఎందుకు పడతారు. అచ్ఛా, నెలకు లక్ష, రెండు లక్షలు సంపాదించినా కానీ అదంతా అంతమైపోతుంది. వాటిని అనుభవించడానికి పిల్లా-పాపలెవరూ మిగిలి ఉండరు. పిల్లలు, మనుమలు, మునిమనుమలు తింటారు అన్న లోభము ఉంటుంది. పునర్జన్మ అదే కులములో తీసుకుంటారని కాదు. పునర్జన్మలు ఎక్కడెక్కడ తీసుకుంటారో తెలియదు. మీరైతే 21 జన్మల వారసత్వాన్ని పొందుతారు. ఒకవేళ తక్కువ పురుషార్థము చేసినట్లయితే ప్రజలలోకి వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు, అప్పుడు ఎంత నష్టము కలుగుతుంది. కావున లాభ-నష్టాల గురించి కూడా ఆలోచించండి. వ్యాపారస్థులు పాపాలు కూడా ఎన్నో చేస్తారు కావున ధర్మార్థము ఎంతో కొంత తీస్తారు. ఇది అవినాశీ జ్ఞాన రత్నాల వ్యాపారము, దీనిని ఎవరో అరుదుగా చేస్తారు. ఈ వ్యాపారము డైరెక్టుగా తండ్రితో చేయాలి. తండ్రి జ్ఞాన రత్నాలను ఇస్తారు. వారు దాత. పిల్లలు పిడికెడు బియ్యాన్ని ఇస్తారు, తండ్రి అయితే అనంతమైన రాజ్యాధికారాన్ని ఇస్తారు. దానితో పోలిస్తే ఇది పిడికెడు బియ్యమే అయినట్లు కదా. మీరంతా సుదాములు. ఏమి ఇస్తారు మరియు ఏమి తీసుకుంటారు? విశ్వ రాజ్యాధికారాన్ని తీసుకొని విశ్వాధిపతులుగా అవుతారు. ఒకటే భారత ఖండము ఉంటుంది అని బుద్ధి చెప్తుంది. ప్రకృతి కూడా కొత్తగా

ఉంటుంది. ఆత్మ కూడా సతోప్రధానముగా ఉంటుంది. సత్యయుగములో దేవతలైన మీరు ఉన్నప్పుడు పవిత్రమైన బంగారముగా ఉండేవారు. తర్వాత త్రేతాలో ఆత్మలో కొద్దిగా వెండి కలుస్తుంది, దానిని వెండి యుగము అని అంటారు. మెట్లు కిందకు దిగుతూ ఉంటారు. ఈ సమయంలో మీరు చాలా ఉన్నతమైనవారు. విరాట రూపము చిత్రము కూడా ఉంది. కేవలం అర్థాన్ని అర్థం చేసుకోరు. ఎన్ని లెక్కలేనన్ని చిత్రాలు ఉన్నాయి. కొందరు క్రైస్టు చిత్రాన్ని పెట్టుకుంటారు, కొందరు సాయిబాబా చిత్రాన్ని పెట్టుకుంటారు. కొందరు ముసల్మానులను కూడా తమ గురువులుగా చేసుకుంటారు. మళ్ళీ అక్కడకు వెళ్ళి మద్యము త్రాగే సభను ఏర్పాటు చేస్తారు. ఎంతటి అజ్ఞానాంధకారము ఉంది అని తండ్రి అంటారు. ఇదంతా భక్తి యొక్క అంధకారము. సాంగత్యం విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలి. సత్సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది అని కూడా అంటూ ఉంటారు. మాయ యొక్క 5 వికారాల సాంగత్యమే చెడు సాంగత్యము. ఇప్పుడు మీకు సత్యమైన తండ్రి యొక్క సాంగత్యము లభించింది, తద్వారా మీరు ఆవలి తీరానికి వెళ్తున్నారు. తండ్రి మాత్రమే సత్యము చెప్తారు. కల్పకల్పమూ మీకు సత్యమైనవారి సాంగత్యము లభిస్తుంది, మళ్ళీ అర్ధకల్పం తర్వాత రావణుడి చెడు సాంగత్యము లభిస్తుంది. కల్పక్రితం వలె రాజధాని తప్పకుండా స్థాపనవుతుందని కూడా మీరు అర్థం చేసుకుంటారు. మీరు విశ్వాధిపతులుగా తప్పకుండా అవుతారు. ఇక్కడ విభజనలు జరిగిన కారణంగా ఎన్ని గొడవలు జరుగుతాయి. అక్కడైతే ఒకే ధర్మం ఉంటుంది. దేవతల అద్వైత రాజ్యం ఉన్నప్పుడు విశ్వంలో శాంతి ఉండేది. ఒకే ధర్మం ఉండేది. అక్కడ అశాంతి ఎక్కడి నుండి వచ్చింది. అది ఈశ్వరీయ రాజ్యము. ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా పరమాత్మ రాజధానిని స్థాపన చేసారు కావున అక్కడ తప్పకుండా సుఖము ఉంటుంది. తండ్రికి పిల్లల పట్ల ప్రేమ ఉంటుంది కదా. తండ్రి అంటారు, మీరు ఎన్ని ఎదురుదెబ్బలు తినవలసి ఉంటుందో నాకు తెలుసు. భగవంతుడు తప్పకుండా ఏదో ఒక రూపములో వస్తారు అని భావిస్తారు. అప్పుడప్పుడు ఎద్దుపైన స్వారీ చేస్తున్నట్లు కూడా చూపిస్తారు. ఎప్పుడైనా ఎద్దుపై స్వారీ జరుగుతుందా. ఎంతటి అంధకారము ఉంది. కావున పిల్లలైన మీరు ఇప్పుడు అందరికీ చెప్పండి - తండ్రి అందరికీ వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు, బ్రహ్మా ద్వారా కొత్త ప్రపంచ స్థాపన జరుగుతుంది. బాబా ఎప్పుడూ మర్రి వృక్షపు ఉదాహరణను ఇస్తారు. ఇప్పుడు దీని పునాది ఏదైతే ఉందో, దానినే మళ్ళీ స్థాపన చేస్తున్నారు, అప్పుడిక మరే ధర్మమూ ఉండదు. భారత్ అవినాశీ ఖండము మరియు అవినాశీ తీర్థము. ఇది తండ్రి జన్మస్థలము కదా. బాబా మధురాతి-మధురమైన పిల్లలకు ఎంత ప్రేమగా అర్థం చేయిస్తారు. టీచర్ రూపంలో చదివిస్తారు. పిల్లలైన మీరు చదువుకొని నా కన్నా ఉన్నతంలోకి వెళ్ళిపోతారు. నేనైతే రాజ్యాధికారాన్ని తీసుకోను. మీరు ఎప్పుడైనా నన్ను - స్వర్గములోకి 'రండి' అని పిలిచారా. నేను మిమ్మల్ని స్వర్గములోకి పంపిస్తాను. ఇది ఎంతటి ఆనందకరమైన ఆట. తండ్రి అంటారు - అచ్ఛా, పిల్లలూ, జీవిస్తూ ఉండండి, నేను వానప్రస్థావస్థలోకి వెళ్ళి ఉంటాను.

తండ్రి అంటారు - ఇప్పుడు ఆపదలు తలపై నిలబడి ఉన్నాయి, అందుకే పురుషోత్తములుగా అయ్యేందుకు ఈ పురుషోత్తమ సంగమయుగములో పూర్తి-పూర్తి పురుషార్థము చేయాలి. తండ్రిని స్మృతి చేసే పురుషార్థము చేస్తూ ఉన్నట్లయితే వికర్మలు వినాశనమవుతాయి మరియు ఎవరు ఎంతగా చదువుతారో వారు అంతగా ఉన్నత కులంలోకి వెళ్తారు. తండ్రి అంటారు - తమ చింతన తాము చేస్తే నషా పెరుగుతుంది. పిల్లలకు సదా తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది. లౌకికంలోనైతే కొడుకుకు లభిస్తుంది. ఇకపోతే కన్యను దానమివ్వడం జరుగుతుంది. ఇక్కడైతే ఆత్మలందరికీ వారసత్వం లభిస్తుంది, అది కూడా అనంతమైన వారసత్వం. కావున ఈ విషయం పట్ల పూర్తి అటెన్షన్ పెట్టాలి. భగవంతుడు చదివిస్తున్నారు, ఒక్క రోజు కూడా మిస్ చేయకూడదు. నాకు తీరిక లేదు అని బాబాతో అంటారు. అరే, నా నుండి చదువుకోవడానికి ఆత్మకు తీరిక లేదా, ఇలా అనడానికి సిగ్గుగా అనిపించడం లేదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సాంగత్యము నుండి స్వయాన్ని ఎంతగానో సంభాళించుకోవాలి. ఒక్క సత్యమైన తండ్రితో సాంగత్యము చేయాలి. 5 వికారాల మాయా సాంగత్యము నుండి చాలా దూరంగా ఉండాలి.

2. చదువు పట్ల పూర్తి అటెన్షన్ పెట్టాలి. మీ ఆనందంలో ఉండాలి. తమ చింతన తాము చేసినట్లయితే నషా పెరుగుతుంది అని అనడం జరుగుతుంది. ఒక్క రోజు కూడా చదువును మిస్ చేయకండి.

వరదానము:- సేవలో స్నేహము మరియు సత్యతా అథారిటీల బ్యాలెన్సు ద్వారా సఫలతామూర్త భవ

ఏ విధంగా ఈ అసత్య ఖండములో బ్రహ్మాబాబాను సత్యతా అథారిటీ యొక్క ప్రత్యక్ష స్వరూపముగా చూసారు. అథారిటీతో కూడిన వారి మాటలు ఎప్పుడూ అహంకారం యొక్క భావనను కలగనివ్వవు. అథారిటీతో కూడిన మాటలలో స్నేహము నిండి ఉంది. అథారిటీతో కూడిన మాటలు కేవలం ప్రియంగా మాత్రమే కాదు, కానీ ప్రభావశాలిగా కూడా ఉంటాయి. కావున ఫాలో ఫాదర్ చెయ్యండి - స్నేహము మరియు అథారిటీ, నమ్రత మరియు మహానత, ఈ రెండూ తోడుతోడుగా కనిపించాలి. వర్తమాన సమయంలో సేవలో ఈ బ్యాలెన్సును అండర్ లైన్ చేసినట్లయితే సఫలతామూర్తులుగా అవుతారు.

స్లోగన్:- నాది అన్న దానిని నీదిలోకి పరివర్తన చెయ్యటము అనగా భాగ్యపు అధికారాన్ని తీసుకోవటము.

అవ్యక్తి సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

ముందుగా మీ దేహపు ఆకర్షణను సమాప్తము చెయ్యండి, అప్పుడు సంబంధాలు మరియు పదార్థాల పట్ల ఆకర్షణ దానికదే సమాప్తమైపోతుంది. ఫరిశ్తాగా అయ్యేందుకు ముందుగా ఈ అభ్యాసము చెయ్యండి - ఈ దేహము సేవ కొరకు ఉంది, ఇది తాకట్టు పెట్టబడినది, నేను నిమిత్తుడిని. ఇక అప్పుడు చూడండి, ఫరిశ్తాగా అవ్వటము ఎంత సహజమనిపిస్తుంది!